## క్లుప్తంగా

### ఏఈని నియమించాలి

రేగోడ్(మెదక్): మండలంలో విద్యుత్ ఏఈని నియమించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.సర్దార్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు ఐదేళ్లుగా విద్యుత్ ఏఈ పోస్టు ఖాళీ ఉందని చెప్పారు. అల్లాదుర్గం మండల ఏఈ రేగోడ్ మండలానికి ఇన్‌చార్జ్‌గా ఉండటంతో రైతులు, ప్రజలకు అనేక ఇబ్బందులు తప్పడం లేదని చెప్పారు. ప్రతీ చిన్న విషయానికి అల్లాదుర్గం మండలానికి రైతులు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. రేగోడ్ మండలానికి శాశ్వత ఏఈని నియమించాలని సంబంధిత అధికారులు, ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### ఘనంగా శివపార్వతుల కల్యాణం



కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శివకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని కన్యకపరమేశ్వరీ ఆలయ 18వ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమాల్లో భాగంగా సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఘనంగా కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో పాటు షుగర్‌కేన్ రిటైర్ కమిషనర్ భూమలింగంగౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు హన్మయ్య, నగేష్, కూనరాంలు, నాగభూషణం, వైశ్య సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో గ్రామస్తులు

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో సీతారామ చంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామంలోని పద్మరాయుని గుట్టవద్ద ఆలయ నిర్మాణానికి ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ దంపతులతోపాటు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మోడల్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

నేటి నుంచి అడ్మిషన్లు

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని మోడల్ జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మంగళవారం నుంచి జూన్ 12 వరకు అడ్మిషన్లు పొందాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జయప్రకాశ్ సోమవారం సాయంత్రం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఎంపిక జాబితా పాఠశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించామని చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్ల లభ్యతను బట్టి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీట్లు ఆఫ్ లైన్ ద్వారా కేటాయిస్తామన్నారు.

### 'దళితుల పిల్లలకు 25శాతం సీట్లు ఇవ్వాలి'



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నర్సాపూర్: బెస్ట్ ప్రైవేట్ స్కూల్స్ విధానం కింద ప్రతీ ప్రైవేట్ పాఠశాలలో 25శాతం సీట్లను ఉచితంగా దళితుల పిల్లలకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దాడిగ నరేశ్ కోరారు. ఆయన ఈమేరకు సోమవారం ఏంఈఓ బుచ్చానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పలువురు యువజన విభాగం నాయకులు ఉన్నారు.

### నేటి నుంచి వరసిద్ధి వినాయక ఆలయ ఉత్సవాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని వరసిద్ధి వినాయక ఆలయ ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం గణపతిపూజ, నవగ్రహ పూజలు, బుధవారం ఆవాహిత దేవత పూజలు, గణపతి హోమం, గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు.

# దేశం తెలంగాణ వైపు చూస్తోంది

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: దేశం తెలంగాణ వైపు చూస్తోందని, తెలంగాణ ప్రభుత్వం పుట్టుక నుంచి చావు దాకా ఆలోచిస్తూ.. విభిన్న కార్యక్రమాలను అమలు చేస్తుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువని వారి సంక్షేమాన్ని కాంక్షించి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసి మహిళల కోసం పలు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. నాడు ఊర్లోకి వెళ్లాలంటే గతుకుల రోడ్లు, ఖాళీ బిందెలతో మహిళలు అడ్డుపడేవారని, కానీ నేడు నీళ్ల యుద్ధాలు, కరెంట్ గోస లేదని అన్నారు. వలస వెళ్లిన వారు తిరిగి ఊర్లకు వస్తున్నారని, నేడు కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలతో ఊళ్లకి కల వచ్చిందన్నారు. వైద్యరంగాన్ని మెరుగుపరిచి అనేక సౌకర్యాలు కల్పించడం ద్వారా నేడు వందకు 81 శాతం ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయని వివరించారు. పుట్టిన బిడ్డకు ఇస్తున్న కేసీఆర్ కిట్ మాదిరే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా బలంగా ఉండాలని ఈ నెల 16 నుంచి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందజేయనున్నామన్నారు. ఆరోగ్యలక్ష్మి ద్వారా పాలు, గుడ్లు అందజేస్తున్నామన్నారు.

**ఈనెలాఖరు గృహలక్ష్మి**

ఈ నెలాఖరు నుంచి గృహలక్ష్మి కార్యక్రమం ద్వారా సొంత స్థలం కల్గిన వారికి ఇళ్లు నిర్మించుకోవడానికి 3 లక్షల రూపాయల ఆర్థిక సాయానానికి శ్రీకారం చూడుతున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మహిళా సమాఖ్య ఆర్థిక బలోపేతానికి పట్టణంలోని వాణిజ్య ప్రాంతమైన స్థలాన్ని కేటాయించామన్నారు. కోటి రూపాయలతో వ్యాపార దుకాణ సముదాయాలు నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా 280 మహిళా సంఘాలకు రూ.23 కోట్ల 51 లక్షల బ్యాంక్ లింకేజి చెక్కును మంత్రి మహిళా సమాఖ్యకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపంలో నిర్మించిన డీసీసీబీ బ్యాంకు భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఆర్‌డీఓ సాయిరామ్, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





పీఆర్టీయూ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



డీసీసీబీ బ్యాంకును ప్రారంభిస్తున్న దృశ్యం

# సంక్షేమ పథకాల్లో ఆదర్శం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

నర్సాపూర్: సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు సత్ఫలితాలు ఇస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రగతి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాలు నేర్చుకునేలా ఉన్నాయన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ ప్రణాళికతో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అసంఘటిత కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధివైపు తీసుకుపోతున్నారని వివరించారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి, గృహ వినియోగానికి, పరిశ్రమలకు కరెంట్‌ను 24 గంటలు సరఫరా చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఆత్మ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పార్టీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు రాజుయాదవ్, శేఖర్, బబియానాయక్, జితేందర్‌రెడ్డి, నయిమోద్దీన్, భిక్షపతి, రాంచందర్, రమణగౌడ్, రామగౌడ్, నగేశ్, మేఘమాల, మంజుల, కవిత, రమేశ్, విద్యుత్ శాఖ డీఈలు రాజేందర్, లీలాప్రసాద్, ఏడీఈ భాస్కర్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, నియోజకవర్గంలోని పలువురు ఏఈలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ రూపొందించిన విద్యుత్ ప్రగతి పుస్తకాన్ని మదన్‌రెడ్డి, సునీతారెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రతిమాసింగ్‌లతో పాటు పలువురు నాయకులు ఆవిష్కరించారు.

### జాండీస్ నివారణపై అవగాహన



జాండీస్ బాధితులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయ్ కుమార్

నిజాంపేట(మెదక్): మండలంలోని నస్కల్ గ్రామంలో జాండీస్ వచ్చిన కుటుంబాలను నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ సందర్శించారు. ఈమేరకు సోమవారం నస్కల్ గ్రామంలోని జాండీస్ బాధితుల ఇళ్లలోకి వెళ్లి వారి కుటుంబాలతో మాట్లాడుతూ.. మీకు ఏదైనా ఇబ్బంది కలిగినట్టు అయితే వెంటనే తనకు సమాచారం అందించాలని తెలిపారు. నస్కల్ గ్రామంలో నీటి సమస్య ఉంటే తొందరగా సమస్యను పరిష్కరించాలని నస్కల్ సర్పంచ్, గ్రామ సెక్రెటరీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి ధర్మారం వైద్యాధికారి హరిప్రియ, మెడికల్ ఆఫీసర్ శ్యామల సూపర్ వైజర్ రేణుక, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంతోష, రేఖ, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ ఎస్ యు ఓ శ్రీనివాస్, సీహెచ్ఓ చందర్, ల్యాబ్ టెక్నీషియన్ వంశీ, జ్యోతి, మాజీ సొసైటీ చైర్మన్ దేశెట్టి లింగం, జాల పోచయ్య, గరుగుల శ్రీనివాస్, తాడెం శ్రీకాంత్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మోదీది మచ్చలేని పాలన

బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్





మాట్లాడుతున్న, అరవింద్ మీనన్

మెదక్‌జోన్: కాంగ్రెస్ హయాంలో పాలనంతా అవినీతిమయమైందని, తొమ్మిదేళ్ల నరేంద్ర మోదీ మచ్చలేని పాలన అందిస్తున్నాడని బీజేపీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ సహ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్ అన్నారు. సోమవారం మెదక్ బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చాక గరీబ్ కల్యాణ్ యోజన పథకం కింద ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయని, జల్ జీవన్ మిషన్ కింద తాగునీరు, ఆవాస్ యోజన పథకం కింద పేదలకు సొంతిటి కల సాకారమైందని చెప్పారు. ఒకప్పుడు ఇతర దేశాలపై ఆధారపడిన భారత్ నేడు అన్నిరంగాల్లోనూ అభివృద్ధి సాధించిందన్నారు. తెలంగాణలో జాతీయరహదారుల నిర్మాణం 2,500 కి.మీ నుంచి 5 వేల కి.మీకి పెరిగిందన్నారు. రాష్ట్రంలో రూ. 1.4 లక్షల కోట్లతో జాతీయరహదారులు నిర్మించినట్లు చెప్పారు. తెలంగాణ ప్రజలకు సబ్సిడీ ఎరువులు అందించేందుకు రూ.6,338 కోట్లతో రామగుండం ఫ్యాక్టరీని పునఃనిర్మాణం చేపట్టి జాతికి అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ జయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు నందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్ సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట జిల్లా బీజేపీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండలాధ్యక్షుడు సంతోషచారి, జిల్లా ఉపాధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **విరాళం**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సితారం తండాలో నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయానికి జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్ సోమవారం ఆలయ నిర్మాణ కమిటీకి రూ.21 వేల నగదుని అందజేశారు. కార్యక్రమంలో దొంతి సర్పంచ్ ఫణిశశాంక్‌శర్మ, బీఆర్ఎస్ నాయకులు హరిశంకర్, ఆంజనేయులుగౌడ్ తదితరులు ఉన్నారు.

◆ **నియామకం**



టేక్మాల్(మెదక్): మండలంలోని పల్వంచ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా పులి మల్లేశంను ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం జోగిపేటలో అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా మల్లేశం, ఉపాధ్యక్షుడిగా డప్పు రాజు, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ, కార్యదర్శిగా అన్నారం బేతయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వీరప్ప, పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, సర్పంచ్ శివకుమార్, నాయకులు అమృతయ్య, సాయిలు, కిష్టయ్య, విఠల్, మోగులయ్య, యదయ్య, మల్లేశం, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **పవర్‌డే రోజే పవర్ కోతలు**

రేగోడ్(మెదక్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పవర్‌డే ఉత్సవాల రోజే పవర్ ఇష్టారాజ్యంగా విద్యుత్ సరఫరా చేయడం ఎమిటని పోచారం సర్పంచ్ సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

◆ **సామూహిక సత్యనారాయణ వ్రతాలు**

కౌల్పారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో ఆదివారం రాత్రి పొద్దు పోయాక రంగనాయక స్వామి ఆలయ సన్నిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు.

◆ **ఆశవర్కర్లు పనితీరును మెరుగుపర్చుకోవాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): ఆశవర్కర్లు పనితీరును మెరుగుపర్చుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం సీహెచ్‌సీలో ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం, వైద్య సదుపాయాలపై సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతీ నెల వైద్యపరీక్షలు చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరిండెంటెంట్ మనీష్, వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

◆ **క్రీడల్లో రాణించాలి**



శివ్వంపేట(నర్సాపూర్): యువకులు రాణించిన క్రీడల్లో రాణించాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లపల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తండాలో నర్సాపూర్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయగా ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ తదితరులు ఉన్నారు.

# ఆత్మగౌరవ భవనాలకు ఉమ్మడి మెదక్ జిల్లా వేదిక



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: ఆత్మగౌరవ భవనాలకు ఉమ్మడి మెదక్ జిల్లా వేదికైందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం మెదక్ పట్టణంలో ముదిరాజ్ ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మహిళా కమిషన్ చైర్మన్ సునీతా లక్ష్మారెడ్డి, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సామాజికవర్గనాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే బలమైన ఉపాధ్యాయ సంఘం అయిన పీఆర్టీయూ హక్కుల కోసమే కాకుండా విద్యార్థుల సమస్యల కోసం పోరాడిందని మంత్రి హరీశ్‌రావు గుర్తు చేశారు. మెదక్‌లో పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

సురక్ష దినోత్సవం అంతకు ముందు సురక్ష దినోత్సవంలో భాగంగా పట్టణంలోని రాందాస్ చౌరస్తా నుంచి పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన



నర్సాపూర్ రూరల్: చిన్నచింతకుంటలో పిల్లల పేర్లు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

డీఈఓ రాధాకిషన్



శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందుతుందని డీఈఓ రాధాకిషన్ అన్నారు. మండలంలోని గోమారం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు గుడ్‌బాయ్ చెప్పి ప్రభుత్వ పాఠశాలలో చేరిన వారికి అడ్మిషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య, ఎంఈఓ బుచ్చనాయక్, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, హెచ్ఎం కిషోర్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

కౌల్పారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట ఇంటింటి సర్వేలో పాఠశాల హెచ్ఎం రాంచంద్రం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం పేటతో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలపై ఉపాధ్యాయులు వివరించారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిన్నచింతకుంటలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి బడి మానేసిన పిల్లలను బడిలో చేరాలని నినాదాలు చేస్తూ ఉచితంగా ఏడాదికి రెండు జతల దుస్తులు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్యపై వివరించారు. ఈ ర్యాలీలో సర్పంచ్ సురేశ్ గౌడ్, హెచ్ఎం నాగుల్ మీరా, ఉపాధ్యాయులు దుర్గాదేవి, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిలప్‌చెడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి**

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేటలో నిర్వహించిన బడిబాటలో సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్, హెచ్ఎంలు బాలచంద్రం, సత్యనారాయణ, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకుందాం



నర్సాపూర్: కార్యక్రమంలో బృందం సభ్యులు



చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో ..

చేగుంట(తూప్రాన్): చెట్లను పెంచి పర్యావరణం కాపాడుకోవాలని చందాయిపేట సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్ అన్నారు. మండలంలోని చందాయిపేట ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులతో పాటు ఆమె మొక్కలు నాటారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటుతున్నట్లు ప్రతీ ఒక్కరూ పర్యావరణం కాపాడుకోవడానికి మొక్కలు నాటి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో సర్పంచ్ కాజిపేట రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, పంచాయతీ కార్మికులు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణకు తమవంతుగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

చిన్నశంకరంపేట(మెదక్): పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని కావేరి ఐరన్ అండ్ స్టీల్ పరిశ్రమ సీఈఓ అనిల్ కుమార్ సక్సేనా అన్నారు. మండలంలోని ఖాజాపూర్ గ్రామంలోని కావేరి ఐరన్ అండ్ స్టీల్ పరిశ్రమలో మొక్కలు నాటడంతో పాటు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగంతో ప్రజలు పర్యావరణ ముప్పును ఎదుర్కొంటున్నారన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఆవరణలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని కేఎస్ఆర్ (క్యూబ్ హైవేస్) ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 161వ జాతీయ ప్రధాన రహదారి ఫేజ్- 2 కేఎస్ఆర్ శంకరంపేట ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఓ అండ్ ఎం సెంటర్ వద్ద పలు మొక్కలను సిబ్బందితో కలిసి నాటారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ కూడా చేపట్టాలని వారికి సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఎస్ మేనేజర్ ఖాజా మోయినొద్దీన్, ప్రశాంత్, నర్సింహారావు, శివకుమార్ సిబ్బంది తదితరులున్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని చెట్లగౌరారం గ్రామ శివారులో ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో నిర్వహించిన కార్యక్రమంలో మొక్కలను నాటారు. పరిశ్రమ ప్రతినిధులు శ్రీధర్ ఉపాధ్యాయ, వసంత్‌కుమార్, అజ్మత్ అలీ, బాలకృష్ణన్, శణ్ముకేశ్వర్, పీఎల్ యాదవ్, రంగాయపల్లి, చెట్లగౌరారం పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

నర్సాపూర్: పర్యావరణాన్ని కాపాడడంలో విద్యార్థులు, యువకులు ఎక్కువ పాత్ర పోషించాలని అరబిందో కంపెనీస్ జనరల్ మేనేజర్ శ్రీధర్ చెప్పారు. పర్యావరణ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలోని ఎన్ఎస్ఎస్ బృందం పలు కార్యక్రమాలు చేపట్టింది. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌దూబె, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రమోద్‌కుమార్, రాజు, డాక్టర్ శ్రీనివాస్‌రావు, చంద్రబాబు, కాలేజీ డీజీఎం బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.





చిన్నశంకరంపేట(మెదక్): ఖాజాపూర్ ఐరన్ అండ్ స్టీల్ పరిశ్రమలో ..



పెద్దశంకరంపేట(మెదక్): మొక్కలు నాటుతున్న ప్రభాకర్‌రెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): మొక్కలు నాటుతున్న దృశ్యం